క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పాదయాత్ర

మోతీనగర్: మూసాపేట డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం ఉదయం 7.30 గంటలకు పాదయాత్ర చేపట్టనున్నారు. డివిజన్‌లోని పిఠర్‌నగర్ పార్కు, వీకర్ సెక్షన్, అవంతినగర్ ఈస్ట్, అవంతినగర్ తోట, బబ్బుగూడ, అవంతినగర్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో వివిధ విభాగాల అధికారులతో పర్యటించనున్నారు. ఈ పాదయాత్రలో బీఆర్ఎస్ కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

వి.రామారావునగర్ ఎస్సీ సెల్ నూతన కమిటీ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వి.రామారావు నగర్ ఎస్సీసెల్ కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. చైర్మన్‌గా జయప్రభాకర్, వైస్‌చైర్మన్‌గా పి.అభిషేకం, చీఫ్ వైస్ అధ్యక్షుడిగా భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా బి.రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్.సురేష్, కోశాధికారిగా మల్లేష్‌జైన్, సెక్రటరీగా డి.కోటేశ్వరులు ఏకగ్రీవమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కరుణాకర్ మాట్లాడుతూ... దళితుల సంక్షేమమే లక్ష్యంగా ఎస్సీ సెల్ కమిటీ పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి దళిత కుటుంబానికి అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ శివశంకర్, వి.వేణుగోపాల్, బి.లక్ష్మణ్, టి.దయాకర్, ఎస్.మోహన్, జి.అనిల్, కె.సుధాకర్ పాల్గొన్నారు.

విజ్ఞానపురి కాలనీ సమస్యలను పరిష్కరిస్తా



విజ్ఞానపురికాలనీ సమస్యలను వింటున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: డివిజన్ పరిధిలోని విజ్ఞానపురికాలనీలో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులతో బుధవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. డ్రైనేజీ పనులు కొంత మేర జరిగాయని పూర్తిగా చేపట్టాలన్నారు. వెంటనే ఆ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా సీసీ రోడ్డు కూడా వేయాలని కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో రామారావు, రాంచందర్‌రాజు, నారాయణరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు

సీపీజీఈటీ-2023లో సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ప్రభుత్వ కళాశాలలో చదివే వారిని తక్కువ అంచన వేయొద్దని నిరూపించిన విద్యార్థులు



శ్రీజాను, 40వ ర్యాంక్



గోడల ప్రవీణ్, 50వ ర్యాంక్



ఆదిశేష, 189వ ర్యాంక్



పిల్లి మానస, 304వ ర్యాంక్



ఐఐటీ కాన్పూర్‌లో ప్రవేశం పొందిన వివేక్

కూకట్‌పల్లి: కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీజీఈటీ) 2023లో కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాల గణితశాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఎంఎస్‌సీ విభాగంలో రాష్ట్రస్థాయిలో పీష్వా శ్రీజానుకు 40వ ర్యాంకు, గోడల ప్రవీణ్‌కు 50వ ర్యాంకు, బర్రె మహేష్‌కు 130వ ర్యాంకు, బి. ఆదిశేషుకు 189వ ర్యాంకు, కనిమెట్ట ప్రవీణ్‌కుమార్ గౌడ్ 236వ ర్యాంకు, పిల్లి మానసకు 304వ ర్యాంకు వచ్చింది. అదే విధంగా వాసం వివేక్ అనేక విద్యార్థికి ప్రతిష్టాత్మకమైన ఐఐటీ కాన్పూర్‌లో ఎంఎస్‌సీ గణిత శాస్త్రంలో ప్రవేశం లభించింది.

◆ ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. అలివేలు మంగమ్మ వివిధ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు ప్రవేశ పరీక్షలో కోచింగ్ ఇచ్చిన డా. ఎస్. విజయ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బందిని మెచ్చుకున్నారు. గణిత శాస్త్ర విభాగాధిపతి డా. కె. సుజాతా, అకడమిక్ కో ఆర్డినేటర్ డా. రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా. భవాని, సైన్స్ విభాగాధిపతి పి. సురేష్, ఆర్ట్ విభాగాధిపతి డా. ఎం ఏ.మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

జయహో.. ఇస్రో



చంద్రయాన్-3 విజయవంతంపై సర్వత్రా హర్షం

మూసాపేట: ఏ నోట విన్నా చంద్రయాన్-3 ప్రయోగం గురించే మాట్లాడుకోవడం కనిపించింది. బుధవారం చంద్రుడిపై సేఫ్ ల్యాండింగ్‌ను ప్రజలు టీవీలలో ఎంతో ఉత్సుకతతో వీక్షించారు. మూసాపేటలోని పంచశీల పాఠశాలలో బుధవారం విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై విజయవంతంగా దిగిన దృశ్యాల్ని పాఠశాల విద్యార్థులకు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ప్రయోగం గురించి, ఇస్రో గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు కాంతారావు శుభాకాంక్షలు

కూకట్‌పల్లి: చంద్రుడిపై పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో పంపించిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంపై కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ దేశానికి సాధ్యం కాని విధంగా చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టి అగ్రరాజ్యాలు సుసాధ్యం అని భావించిన దానిని భారత్ సాధ్యం చేసి జయహో భారత్ అనేలా చేసిందన్నారు. విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై దిగ్విజయంగా కాలుమోపి భారత వైజ్ఞానిక సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ భరోసా, సహకారమే నేడు రెట్టింపు ధైర్యంతో శ్రమించి శాస్త్రవేత్తలకు దక్కిన ఫలితమే చంద్రయాన్-3 విజయమని కొనియాడారు. ఈ విజయంలో భాగమైన ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి కాంతారావు శుభాకాంక్షలు తెలిపారు.





విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై దిగిన దృశ్యాలను వీక్షిస్తున్న విద్యార్థులు

కాంగ్రెస్ బస్తీ భరోసా యాత్ర షురూ



అంజయ్యనగర్‌లో జెండాలతో కాంగ్రెస్ నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం.. కేంద్రంలోని మోదీ పాలన వైఫల్యాలను ఎండగడుతూ బుధవారం కాంగ్రెస్ పార్టీ బస్తీ భరోసా యాత్ర కొనసాగింది. టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళ్‌రావు, సత్యం శ్రీరంగం మొదటి రోజు యాత్రను అంజయ్యనగర్ అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు కె. మల్లికార్జున్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పాదయాత్ర అంజయ్యనగర్, జయశంకర్‌నగర్ కొనసాగింది. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 50 రోజుల పాటు బస్తీ భరోసా యాత్ర కొనసాగుతుందన్నారు.

◆ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే రూ. 500 వందలకే వంటగ్యాస్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, చేయూత పెన్షన్ రూ.4వేలు, తొలి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి కింద రూ.4వేలు, డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇంటికి రూ.5లక్షల ఆర్థికసాయం, 18ఏళ్ల పైబడి చదువుకునే ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లను అందిస్తామని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలిపారు. ఈ యాత్రలో కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, రాఘవేందర్, తూము వేణు, సంతోష్, మధుగౌడ్, కృష్ణా రాజ్‌పుత్, రమేష్ పాల్గొన్నారు.

ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింగ్‌రావు, వాసు, సత్యనారాయణ

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి తిరిగి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు టికెట్ కేటాయించడం ఆనందంగా ఉందని మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్‌రావు, ఉద్యమకారుడు వాసు యాదవ్, అంజయ్యనగర్ రిటైల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మక్కాల సత్యనారాయణ అన్నారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ ఎమ్మెల్యే ఈ ఎన్నికల్లోనూ అత్యధిక మెజార్టీతో గెలిచి హ్యాట్రిక్ విజయం నమోదు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అల్పాహారం పంపిణీ

మోతీనగర్: బంజారాహిల్స్ లయన్స్ క్లబ్ 320-ఏ ఆధ్వర్యంలో బుధవారం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామని లయన్ కేల వెంకటరావు పేర్కొన్నారు. మోతీనగర్ చౌరస్తాలో కూలీలకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యం గంగపుత్ర, రోణంకి జగన్నాథం, ఆదినారాయణ, సంజీవ్‌పటేల్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పల్లపువేణు ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పల్లపు వేణు ఆధ్వర్యంలో నిమ్స్ ఆస్పత్రి వద్ద రోగులకు భోజనం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రుల వద్ద అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాకీర్ బాషా, సందీప్, తరుణ్, వెంకట్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



మోతీనగర్ చౌరస్తాలో అల్పాహారం అందజేస్తున్న లయన్ కేల వెంకటరావు

బాధ్యతల స్వీకరణ

మూసాపేట: మూసాపేట సబ్ రిజిస్ట్రార్‌గా బుధవారం విజయ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన వనజకుమారి బదిలీపై దూద్‌బౌలి వెళ్లారు. వల్లభ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చి బుధవారం విజయ్ బాధ్యతలు తీసుకున్నారు. వనజ కుమారి రెండేళ్ల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించిన విషయం తెలిసిందే.

'డబుల్' ఇళ్లను విడతల వారీగా అందిస్తాం



శేషాద్రినగర్‌లో మహిళా సైమక్య గ్రూపులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: శేషాద్రినగర్ కమ్యూనిటీహాల్‌లో మహిళా సమైక్య గ్రూపులతో బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో నిరుపేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను అసలైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. కూకట్‌పల్లిలో గతంలో 10వేల పింఛన్ లబ్ధిదారులు ఉండేవారన్నారు. ఈ తొమ్మిదేళ్లలో మరో 32వేలు మందికి పింఛన్‌లు అందజేసి అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పుడు మొత్తం 42వేల మంది లబ్ధిపొందుతున్నారని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు కోసం లబ్ధిదారుల తనిఖీ జరుగుతోందన్నారు. ఇవి విడతల వారీగా అందజేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు గత పాలకుల పాలనలో ఎలా ఉండేవి ఇప్పుడు ఎలా ఉండేవో పోల్చి చూసుకోవాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నాగిరెడ్డి దరఖాస్తు

మూసాపేట: కూకట్‌పల్లి, సనత్‌నగర్ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తనకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.



దరఖాస్తు అందజేస్తున్న ఏ-బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి

జేఎన్‌టీయూ ఈసీఈ సెమినార్ హాల్ ప్రారంభం

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీలో బుధవారం ఈసీఈ విభాగంలో యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డా. కట్టా నర్సింహారెడ్డి సెమినార్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీ డా. రజిని మాట్లాడుతూ.. ఈసీఈ డిపార్టుమెంట్‌ను ప్రవేశపెట్టి 50ఏళ్లు కావస్తోందన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ... యూనివర్సిటీలో కానీ, కళాశాలలో కానీ నాలుగు అంశాలు చాలా ముఖ్యమైనవని అన్నారు. ముఖ్యంగా కాలేజీ లేదా యూనివర్సిటీ ఆవరణ, పరిసరాలు చాలా ముఖ్యమన్నారు. ఆయా డిపార్టుమెంట్‌లో ఇప్పటికే చాలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరమని సూచించారు. విద్యార్థులు ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈవెంట్ నిర్వాహకురాలు మౌనిక, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

టీపీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం



సర్కిల్ కార్యాలయంలో కార్మికులకు మద్దతు తెలుపుతున్న సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: మూసాపేట సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు బుధవారం చేపట్టిన నిరసన దీక్షకు టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. జీహెచ్‌యంసి పరిధిలో దాదాపు 27వేల మంది పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుందన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుము వేణు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారాజ్‌పుత్, మహేష్‌గౌడ్, సూరి, నయీమ్, ప్రకాష్ ముదిరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాఘవేంద్రకాలనీ కమ్యూనిటీహాల్ పనులు షురూ



పనులను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ పనులను బుధవారం మాజీ కార్పొరేటర్ బాబూరావు పగుడాల బాబూరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కమ్యూనిటీహాల్ కోసం నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. కాలనీలో చిన్న సమావేశాలు, శుభకార్యక్రమాలు చేసుకోవడానికి వీలుగా ఈ కమ్యూనిటీహాల్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళా కార్యదర్శి శైల, భీమ్‌రావు, స్వామిగౌడ్, బీరప్ప, దొరబాబు, తుకారాం కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి సత్యం శ్రీరంగం దరఖాస్తు



దరఖాస్తును అందజేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం బుధవారం టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం దరఖాస్తు చేసుకున్నారు. ముందుగా మూసాపేటలోని నరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాంధీ భవన్‌లో తన అభ్యర్థిత్వానికి సంబంధించిన పత్రాలతో కూడిన దరఖాస్తును పార్టీ పెద్దలకు సమర్పించారు. పార్టీ అవకాశం ఇస్తే ఖచ్చితంగా ప్రజల తరపున పోరాడి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీ-బ్లాక్ అధ్యక్షుడు మధుగౌడ్, కేపీహెచ్‌బీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ముట్టడి.. పోలీసుల కట్టడి



కేపీహెచ్‌బీ పీఎస్ వద్ద నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ మహేందర్, కార్యవర్గ సభ్యులు సూర్యరావు

కూకట్‌పల్లి: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి సూచనల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి బుధవారం బీజేపీ నాయకులు బయల్దేరారు. అర్హులకి డబుల్ బెడ్‌రూమ్, రేషన్‌కార్డులు, పెన్షన్లు, నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమిని ఇవ్వాలని నినాదాలు చేశారు. పోలీసులు వారిని అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోలీసులను అడ్డంపెట్టుకొని అరెస్టులు చేసి కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా ఎంతమందిని అరెస్టులు చేసినా ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. నిరంకుశ కేసీఆర్ పాలనను తెలంగాణ ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెబుతారన్నారు.





పన్నాల హరీష్‌రెడ్డి, మాధవరం కాంతారావు హౌజ్ అరెస్టు

జీవనోపాధిలో నూతన ఆవిష్కరణలు అవసరం

రాయదుర్గం: జీవనోపాధిలో నూతన ఆవిష్కరణలు అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. సుస్థిర అభివృద్ధిపై అందరూ దృష్టి సారించాలని, జీవనోపాధి, పేదరికనిర్మూలన, అగ్రిటెక్, యువత పురోభివృద్ధి అవసరమని కూడా వక్తలు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో నాల్గవ ఎడిషన్ సమావేశాన్ని నడ్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'చర్చా-23' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సెర్ప్ సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ అభయ్‌సింగ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మహీంద్రా గ్రూప్ హెచ్‌ఆర్‌ప్రెసిడెంట్ రుజ్‌బిహ్ఇరానీ, ప్రథమ్ సీఈఓ డాక్టర్ రుక్మిణీబెనర్జీ, సీఓఆర్ఎస్ సీఈఓ, వ్యవస్థాపకులు సాయిరీచాహల్, వరల్డ్ బ్యాంక్ సీనియర్ ఎకనామిస్ట్ గ్రాయనభట్టాచార్య, వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అభివృద్ధిలో మహిళలు, యువతను భాగస్వాములను చేయాలని, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఎంతో మార్పు సాధ్యమని అభిప్రాయపడ్డారు. అనంతరం వ్యవసాయరంగంలో కూడా చాలా మార్పులు రావాల్సిన అవసరం ఉందని సమావేశంలో పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి



బుర్రె శ్రీను (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన బుర్రె శ్రీను (42) కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజులో నివాసం ఉంటూ కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో ఏడో ఫేజ్ వద్ద ఫ్లై ఓవర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఒక గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

హెచ్‌సీయూ-అనంత్ టెక్నాలజీస్ ఒప్పందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ-మెసర్స్ అనంత్ టెక్నాలజీస్ మధ్య ఓ ఒప్పందం బుధవారం కుదిరింది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఈ ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంత్ టెక్నాలజీస్ అనేది అంతరిక్షం, వ్యూహాత్మక రంగంలో పనిచేస్తున్న భారతదేశంలోని హైదరాబాద్ ఆధారిత మార్గదర్శక పరిశ్రమ. ట్యూనబుల్ మైక్రోవేవ్ పరికరాలు, సెన్సార్లతో హెచ్‌సీయూ వద్ద జరుగుతున్న పరిశోధన ప్రయత్నాలలో కొన్నింటికి అనుబంధం కోసం వారు హెచ్‌సీయూతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు.